# మృత్యుగీతం

సినిమా రోడ్డులో హుషారుగా నడుస్తున్నాడు రామ్మూర్తి.

జీతాలు అందిన ప్రతిసారీ ఓ వందరూపాయలు జేబులో వేసుకొని అందుకు సరిపడా సుఖపడ్డం అతనికి అలవాటు!

మొదటి ఆట సినిమా అప్పుడే వదిలారు. రోడ్డుమీద వెళ్తున్న జనాన్ని చూసుకుంటూ నడుస్తున్నాడు రామ్మూర్తి. ప్రపంచంలోని అందాలన్నీ ఆ రోడ్డు మీదే తారట్లాడుతున్నట్టు అనిపించింది అతనికి!

పదహారు నుండి నలభై ఆరువరకూ ప్రతి ఆడదీ అతని కళ్ళకు అందంగానే అగుపిస్తోంది. అయితే, అలా కనిపించిన ఆడవాళ్ళలో తన జేబులోని వందకు లొంగిపోయే గుణాన్ని వెదుక్కుంటున్నాడు రామ్మూర్తి.

రామ్మూర్తికి వయస్సు రాగానే ఆ వయసు చేసే అల్లరికి మార్గం దొరికింది అతనికి ఒక వేశ్యరూపంలో. అప్పట్నుంచి రెగ్యులర్‌గా కాకపోయినా నెలకు "ఒకటీ అరా" అనుభవాలకు 'అలాంటి' వాళ్ళ నుండే వెదుక్కోవడం అతనికి పరిపాటయ్యింది.

బజారు సరుకు రుచి మూడ్డం వల్ల శరీరంలో ఇబ్బందులు కలిగితే సుల్తాన్ బజార్... 

ఇబ్బందులు కలిగితే సుపీదు సెంటర్లోని మెడికల్ షాపులో తెలిసిన కుర్రాడిచ్చిన టాబ్లెట్లు వేసుకోవడం, తాత్కాలిక ఉపశమనం పొందడం రోటీనయ్యింది.

ప్రస్తుతం రామ్మూర్తి వయస్సు ఇరవై ఎనిమిది!

అప్పటికే పన్నెండేళ్ళ సుదీర్ఘమైన అతని అలవాటు వల్ల రెండురోజులు కూడా ఆ బాధల వల్ల ఎప్పుడూ మంచాన పడ్డం ఎరగడు.

అటువంటి అతనికి రెండేళ్ళ క్రిందటే వివాహ మయ్యింది.

భార్య పేరు సునంద.

ఆమె పెద్ద అందగత్తె కాకపోయినా అనాకారి మాత్రం కాదు.

రామ్మూర్తి కంటే ఆమే చాలా అందంగా, నాజూగ్గా కనిపిస్తోంది కూడా.

సునంద భార్యగా రామ్మూర్తి జీవితంలోనికి ప్రవేశించిన తర్వాత కూడా పాత జీవితానికి స్వస్తి చెప్పాలని ఆలోచించలేదు అతను.

నెలనెలా జీతాల రోజున వందరూపాయలు 'బజార్లో' పోసే అతని అలవాటూ పోలేదు!

'మగవాడు అనేవాడు అందినంతమేర ఆడ సుఖాల్ని అందుకొని, ఆనందించాలన్న' థియరీని ఒకదాన్ని తానే రూపొందించుకొని, దానిని తు.ఛ. తప్పకుండా అమలు జరుపుకుంటూ వస్తున్నాడు!

సునంద కూడా ఏ రోజూ రామ్మూర్తిని నిలదియ్యలేదు. ఫస్ట్ తారీఖున పన్నెండొందల జీతానికి బదులు పదకొండు వందలే తన చేతిలో పెడుతున్నా 'మరో వందుండాలి ఏదీ?' అని ఎప్పుడూ ప్రశ్నించలేదు.

ఆ ఒక్కరోజూ అర్ధరాత్రి వచ్చి తన పక్కలో పడుకొనే భర్త వంటి నుండి చవకబారు సెంటువాసన, నలిగిపోయిన అతని షర్టుపై అంటుకొని కడుపులో తిప్పేట్టు గుప్పున కొట్టినా... 'దేని వొంటినుండి అంటించుకువచ్చారీ పాడు వాసన?' అని నోరు విప్పలేదు.

తాను నెలతప్పినట్టు తెలిసినప్పటి నుండి రామ్మూర్తి చర్యలను అస్సలు పట్టించుకోవడమే మానేసింది ఆమె.

ఇరవయ్యో శతాబ్దం అంతంలో పద్దెనిమిదో శతాబ్దం ప్రారంభకాలంలో ఆడదానిలా ప్రవర్తించే అతి అణకువ గల సునంద తన భార్యగా లభించినందుకు రామ్మూర్తి పొంగిపోతూంటాడు ఇందుకే!

పద్మనాభ థియేటర్ దాటేసరికి ఎదురయిన యువతి వంక పరీక్షగా చూశాడు అతను. ఆ బాపతు లక్షణాలు ఆమెలో పుష్కలంగా కనిపిస్తున్నాయి.

అక్కడే ఆగిపోయి సిగరెట్ వెలిగించుకున్నాడు.

ఆదో రకం సిగ్నల్!

ప్యాసెంజరు చురుకుదనం గమనించిన ఆ యువతి ముందుకు నడవడం ప్రారంభించింది.

ఆమె వెనుక ఐదారడుగుల ఎడంగా తనూ నడవసాగాడు రామ్మూర్తి.

స్వప్న థియేటరు దాటాక, నాలుగైదు సందులు తిరిగి చిన్న పూరిగుడిసె లాంటి ఇంటిలోకి వెళ్ళిందామె.

ఆమె వెనుకే లోపలికి ప్రవేశించిన రామ్మూర్తి ఆగలేనివాడిలా గట్టిగా వాటేసుకుని హత్తుకు పోయాడా యువతిని.

"ఆగండాగండి! అంత ఆత్రమా! వన్ అవరుంటారా? నైటంతానా?" రామ్మూర్తి చేతుల్ని తన వొంటి మీద నుండి తప్పించి, ఎడంగా జరుగుతూ అడిగిందామె.

"రేటెంతేమిటి?"

"వన్ అవరుంటే ఫిఫ్టీ... నైటంతా అయితే టూ హండ్రెడ్!" చెప్పిందామె. భుజాన ఉన్న వ్యానిటీ బ్యాగును గోడకున్న మేకుకు తగిలిస్తూ.

"నైటంతా ఉండేలేనుగానీ, టు అవర్స్ండి హండ్రెడిచ్చి వెళ్ళిపోతాను. ఇష్టమేనా?" ఆమె శరీరం లోంచి వస్తున్న తీయని పరిమళాలను ఆఘ్రాణిస్తూ అన్నాడు.

సహజంగా ఆమె గంట లేదా, నైటు బిజినెస్‌లే చేస్తుంది. అంతే తప్ప రెండు గంటలు... గంటన్నర ఇలాంటి కొసరు బేరాలు ఆమెకు నచ్చవు. అప్పటికే రాత్రి పదిదాటి పోయింది. శీతాకాలం చలిలో దొరికిన బేరాన్ని వొదులుకొని, మరోసారి రోడ్డున పడ్డం బాగుండదనిపించింది ఆమెకి!

తను అడిగిన దానికి సమాధానం చెప్పకుండా జాకెట్ హుక్స్ తీస్తున్న ఆమెను చూసి 'ఇష్టమే'నన్న మాట అనుకుంటూ, తనూ ఆమె వస్త్ర విసర్జన కార్యక్రమంలో సహకరించసాగాడు.

★ ★ ★

ఇది జరిగిన వారం రోజుల తర్వాత...

శరీరంలో అనుమానం కనిపించడంతో అలవాటైన మందుల షాపుకెళ్ళాడు. అందులో పనిచేస్తున్న రామ్మూర్తికి తెలిసిన కుర్రాడు అతన్ని చూడగానే బయటకు వచ్చాడు.

"ఏమిటి గురూగారూ! చాలాకాలానికి కనిపించారు. ఏదన్నా ఎటాకయినట్టు అనుమానమా?" నవ్వుతూ ప్రశ్నించాడు.

తన పరిస్థితి మొత్తం చెప్పి, అతనిచ్చిన మందుల్ని తీసుకొని సైకిలెక్కి ఇంటికి బయలుదేరాడు రామ్మూర్తి!


ఇంతలో వెనుక నుండి బాగా పరిచయం ఉన్న గొంతు 'రామ్మూర్తీ!' అంటూ పిలిచినట్టు అనిపించడంతో సైకిలు దిగి వెనక్కి చూశాడు.

తనవైపే ఉత్సాహంగా అడుగులు వేస్తూ గబగబా నడిచివస్తున్న మనిషిని గుర్తుపట్టాడు.

"ఏరా! సుందరం బాగున్నావా?" చాలా కాలానికి కనిపించిన మిత్రుడ్ని పలకరించాడు రామ్మూర్తి.

"ఏం బాగులే!" నైరాశ్యం నిండిన నవ్వొకటి నవ్వాడు సుందరం. గడ్డం మాసిపోయి ఉంది. ఉన్న వయస్సు కంటే రెట్టింపు వయస్సు మీద పడ్డట్టు అగుపిస్తున్న మిత్రుడి బాధలేంటో వినాలనిపించి కిన్నెర

యస్.కె.నాగేశ్వరరావు



రెస్టారెంట్లోకి నడిచాడు రామ్మూర్తి. వెనకే మందరం!

"ఇప్పుడు చెప్పు! ఈ అవతారమేంటి? నా పెళ్ళికి కూడా నువ్వు రాలేదు. ఇప్పుడు కూడా మా ఇంటికి రాకుండా ఎక్కడదిగావ్?"

ప్రశ్నలతో ఊపేశాడు మిత్రుణ్ని రామ్మూర్తి. అతను చెప్పిన సమాధానాల్ని విన్నాడు. సర్వర్ తెచ్చిన కాఫీను ఇద్దరూ తాగారు.

"అదిసరే! నువ్వు ఆ పాత 'అలవాటు'ను ఇంకా కంటిన్యూ చేస్తున్నావా?" అడిగాడు మందరం.

ఊహించని విధంగా అతన్నుండి వచ్చిన సందేహానికి చిన్నగా నవ్వాడు రామ్మూర్తి.

"ఆ అలవాటేనా... ఇంకా ఉందోయ్! మానేస్తే కదా నువ్వన్నట్టు పాతబడ్డానికి?"

"పెళ్ళయింతర్వాతైనా మానేయకపోయావా?"

"భలేవాడివే! ఆడది తనకు అనుభవాన్ని అందించిన తొలిమగాణ్ని ఎలా మరచిపోలేదో, అలాగే మగాడూ తన తొలి ఆడదాన్ని మరువలేడు. కాకపోతే నేను అనుభవాన్ని పొందింది 'అలాంటి' మనిషి దగ్గర కావడం వల్ల, ఇదిగో ప్రతినెలా అందుబాటులో ఉన్న ఎవరోకొకరి దగ్గర 'అలవాటు'ను కంటిన్యూ చేస్తున్నాను..."

చెప్పాడు క్యాజువల్‌గానే రామ్మూర్తి.

"చాలా తప్పు చేస్తున్నావురా!" బాధపడుతూ అన్నాడు మందరం.

"చదువుకొనే రోజుల్లో తెలిసీ తెలియని తనంతో నేను పాడయ్యింది కాక, నిన్నూ పాడుచేశాను. గతంలో చీకటి గదుల్లో బజారు స్త్రీలతో పొందిన సుఖాలకు ఫలితంగా శరీరంలో దీర్ఘకాల రోగాలకు చోటు ఏర్పరిచాను. ఆ రోగాలు నాలోనే ఉండిపోతే బాగుండును. అవి నా భార్యకూ పంచబడి...... మాకు పుట్టిన ఇద్దరు పిల్లల్లోనూ శాశ్వత అంగవైకల్యాలకు గురిచేసింది......"

తనలో గుండె బరువును ఒక్కసారిగా దించుకున్నం

దుకేమో, సుందరం కళ్ళలో నీరు చిప్పిల్లి కనుకొనల్లో నిలిచిపోయింది!

మిత్రుడు చెప్పిన విషయాన్ని మింగడం కష్టమయ్యింది రామ్మూర్తికి.

"రేటు చెల్లించి మరీ పొందిన సుఖాలకు ఫలితం జీవితాంతం వెన్నాడి పీడించి కష్టపెట్టే యిలాంటి మానసిక, శారీరక రుగ్మతలు కలుగుతాయని ముందే తెలిసి వుంటే అసలీ విషవలయంలోకి ప్రవేశించేవాడే కాదేమో?!"

శరీరంలో రోగం అంకురం ప్రవేశించిందేమోనన్న అనుమానం కలిగినప్పుడయినా డాక్టరు దగ్గరకు వెళ్ళి వైద్యం చేయించుకోలేదు. సిగ్గుతో, పరువు పోతుందేమోనన్న భయంతో మందుల షాపు కుర్రాడి ట్రీట్‌మెంట్‌తోనే సరిపుచ్చుకున్నాడు.

సునంద అమాయకురాలు! పడకలో ఇబ్బంది ఫీలవుతుంటే 'సెక్సు విషయంలో ఆమె ఎప్పుడూ ఇంతే!' అనుకున్నాడే గానీ... బజార్నుండీ అతి జాగ్రత్తగా కొని తెచ్చిన విషక్రిముల్ని ఆమెలోకి ప్రవేశపెడుతున్నానన్న సంగతిని తెలుసుకోలేక పోయాడు.

భగవాన్! సునంద ప్రస్తుతం గర్భవతి. సుందరం పిల్లలకు పట్టిన గతి తన పిల్లలకూ పడితే... ఏమిటీ దారి?

అంతర్మథనంలో పడ్డ రామ్మూర్తి సుందరం పిలుపుకు ఉలిక్కిపడ్డాడు.

"ఏమిట్రా... ఏం లేదు..." ఆలోచిస్తున్నావు?"

"ఏంలేదు... ఏంలేదు..." తొట్రుపడ్డాడు రామ్మూర్తి.

"నువ్వు ఊరికే వర్రీకాకు. నా అనుభవం చెప్పాను. ఇక మీదటైనా జాగ్రత్తగా ఉండు. అర్జెంటు పని ఉండి ఆఫీసుకు శెలవు పడేసి వచ్చాను. పని సాయంత్రానికయిపోతుంది. ఉదయం మళ్ళీ జాయినై పోవాలి. ఈ సారెప్పుడైనా మీ ఇంటికి వస్తాలే..."

ఇద్దరూ హోటలునుండి బయటకు రాగానే, చెప్పి, కంగారుగా వెళ్ళిపోయాడు సుందరం.

సుందరం వెళ్ళిపోయాక, అన్యమనస్కంగానే ఇంటి కొచ్చాడు రామ్మూర్తి.

మిత్రుడు చెప్పింది అతని మెదడులో సుళ్ళు తిరుగుతోంది.

ఆ రాత్రి అతనికి సరిగ్గా నిద్రపట్టలేదు. ఆ పరిస్థితి ఆ రాత్రే కాదు చాలారాత్రులు కొనసాగింది. కళ్ళు మూసుకుంటే చాలు అంగవైకల్యంతో ఉన్న పిల్లలు ఏడుస్తూ కనిపించసాగేరు. ఆ దృశ్యం భయంకరంగా అనిపించసాగింది అతనికి!

నెల రోజులు గడిచే సరికల్లా బెంగతో రామ్మూర్తి సగం మనిషయ్యాడు. జీతాల రోజున విధిగా బయట తిరిగి, తిరిగి ఇంటికి చేరే భర్త, ఈ మధ్య ప్రతిరోజూ నెల మొదటి తారీఖున సైతం ఇంటిపట్టునే ఉండడం గమనించింది సునంద.

"మొదటి కాన్పుగదాని, నా మీద ప్రేమతో నేనేమైపోతానోనని బెంగపెట్టుకుంటున్నారేమో! అనవసరంగా ఎలాంటి భయం పెట్టుకోకండి. ప్రక్కింటి పిన్నిగారు చెప్పారు. నర్సింగ్‌హోంలో చేరితే ప్రసవం బాగా జరుగుతుందని."

భార్య అమాయకత్వానికి నవ్వొచ్చింది రామ్మూర్తికి. అంతలకు రెట్టింపు బాధ కలిగింది.

"పిచ్చి సునందా! నీకు తెలీదు. నేను నిన్ను అమాయకురాల్ని చేసి బయట తిరిగిన తిరుగుళ్ళ ఫలితం రేపు మన మధ్యకు వచ్చి మనల్నెప్పుడూ వ్యధలకు గురిచేయబోతుందని..."

ఇదంతా ఆమెకు చెప్పాలనే ఉంది. కానీ గొంతు పెగల్లేదు అతనికి!

★ ★ ★

ఎబార్షన్ చట్టబద్ధం చేశారని డాక్టర్ని కలిశాడు రామ్మూర్తి. అప్పటికే సునందకు ఆర్నెల్లు గర్భం కావడం వల్ల పెద్ద ప్రాణానికే ముప్పనడంతో రామ్మూర్తి వెనక్కి వచ్చేశాడు. ఈ సంగతులేం సునందకు తెలీకుండానే ఉంచాడు.

ఏడో నెల రాకముందే సునందను పుట్టింటికి పురిటికి తీసుకువెళ్ళడానికి వచ్చిన అత్తామామలతో "సునంద ఇక్కడే పురుడు పోసుకుంటుంది. దాన్ని విడిచి ఒక్క క్షణం ఉండలేను" అని తేల్చి చెప్పి వాళ్ళను పంపేశాడు రామ్మూర్తి.

కష్టపడి బుర్ర బద్దలు కొట్టుకొని సుమారు రెండు నెలలుగా ఆలోచిస్తున్న ప్లానును అమలు చేయడంలో మొదటిపార్టు విజయవంతంగా పూర్తయిపోయినందుకు సంతోషించాడు అతను.

ఇహ... సెకండ్ పార్ట్!

దాన్ని డీల్ చేయాలంటే నమ్మకమైన మనిషి కావాలి?

ఆ నర్సు ప్రసూతి వార్డు నర్సు!

నెలలు నిండగానే నర్సింగ్‌హోంలో చేర్పించాడు సునందని.

ఆమె నర్సింగ్‌హోం చేరిన మర్నాడే, ప్రసూతి వార్డు నర్సు ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాడు రామ్మూర్తి.

అతను చెబుతున్న విషయం పూర్తికాగానే స్థాణువై పోయింది ఆమె.

'పుట్టీపుట్టకముందే పుట్టిన పసికందును చంపేయాలా?'

విస్మయంగా ఆమె కళ్ళు విప్పారాయి.

రెండువేల రూపాయల నోట్లకట్ట ఆమె చేతిలో పడగానే, విషయం విని చల్లబడిపోయిన నర్సు వళ్ళు నార్మల్‌కు చేరిపోయింది.

'పెళ్ళాం ఎవడితోనో తిరిగివుంటుంది. ఆ పాపం తన బిడ్డగా చెలామణీ కాకూడదని ఈ పాపం చేస్తున్నాడేమో ప్రబుద్ధుడు' మనసులో అనుకొందామె.

"ఈ విషయం మనలోనే ఉంచాలి. తప్పకుండా మీ పని చేస్తాను వెళ్ళండి."

ఉత్సాహంగా బయటకు వచ్చాడు రామ్మూర్తి. ప్లాన్‌లో సెకండ్ పార్టు కూడా పూర్తవడంతో.

★ ★ ★

"మీ మిసెస్‌కు రేపు డెలివరీ రావొచ్చండీ. ఎందుకైనా మంచిది సెలవుపెట్టి ఇక్కడే ఉండండి" డాక్టరమ్మ మాటలకు ఉలిక్కిపడ్డాడు రామ్మూర్తి.

"సారీ! డాక్టర్! రేపు ఆఫీసులో ఇన్స్పెక్షన్ ఉంది. మీ పని కానివ్వండి. నేను ఉండి చేసేదేముంది" అసంకల్పిత ప్రతీకారచర్యలా అబద్ధం చెప్పేశాడు వెంటనే.

"ఉండి ఏదో చేస్తారని కాదు. తొలి కాన్పుకదా! మీ వైఫ్‌కు ధైర్యంగా ఉంటుందని... సరే మీ ఇష్టం" చెప్పి రౌండ్స్‌కి వెళ్ళిపోయిందామె.

'భగవంతుడా ఈ గండం గట్టెక్కించు. నా గత జీవిత స్మృతి చిహ్నంలా అంగవైకల్యంతో పుట్టే వికృతరూపాన్ని నా భార్యతో కలిపి నా ఇంటిలోకి అడుగుపెట్టకుండా నిరోధించు......"

ఆ రాత్రి ఆలోచనల్తోనే తెల్లారింది రామ్మూర్తికి.

ఆఫీసుకు వెళ్ళినా పనిచేయలేక, సెలవుపడేసి వీధుల వెంట తిరిగాడు పిచ్చాడిలా.

సాయంత్రం ఆరయ్యింది. ఆస్పత్రి ఆవరణలోకి అడుగుపెట్టాడు రామ్మూర్తి.

దూరంగా రూమ్ నెంబర్ ఇరవై ఆరు మెరుస్తూ కనిపించింది.

ఆ గదిలోంచి ఏడుపుతో సునంద కంఠం వినిపించింది అతనికి.

థర్డ్ అండ్ లాస్ట్ పార్ట్ సైతం సక్సెస్ కావడంతో ఒక్కసారే మనసంతా దూదిపింజలా ఆనందంతో తేలిపోతున్నట్టు అనిపించింది రామ్మూర్తికి.

గబగబా అడుగులేస్తూ గదిచేరి, లోపలికి అడుగు పడక అక్కడే ఆగిపోయాడు.

లోపల కనిపిస్తున్న దృశ్యం గుండెల్ని పిండేస్తుంటే అరవడానికి కూడా శక్తిలేని వాడిలా తలుపుకు జేరబడిపోయాడు నిస్పత్తువుగా రామ్మూర్తి.

లోపలికి రాబోతూ ఆగిపోయిన భర్తను చూసింది సునంద.

అప్పటికే ఏడ్చి, ఏడ్చి అలసిపోయిన ఆ బాలింతరాలికి భర్తను ఆ సమయంలో చూడగానే ఏడుపు మరింతగా తన్నుకు వచ్చింది.

"ఎంతఘోరం జరిగిపోయిందో చూడండీ! బంగారం లాంటి బిడ్డ... పుట్టీ పుట్టకముందే ప్రాణం తీసేసాడండీ పాపిష్టి దేవుడూ..."

హిస్టీరియక్‌గా అరిచిందామె.

"అన్యాయంగా పసిప్రాణం తీయించింది నేనే సునందా! దేవుడు పోసిన ఊపిరిని ఆపేసిన పాపిష్టివాణ్ణి నేనే... నేనే సునందా..." వెర్రిగా అరుచుకుంటూ లోపలి దృశ్యం చూడలేక బయటకు పరుగుపెడుతున్న రామ్మూర్తిని సునందే కాదు ఆస్పత్రి ఆస్పత్రంతా ఆశ్చర్యంగా చూసింది.

●